

చిరంజీవి దంపతులు, వశిష్ఠ, విక్రమ్

ఫాంటసీ అడ్వెంచర్‌కు శ్రీకారం

అగ్ర నటుడు చిరంజీవి ఓ ఫాంటసీ అడ్వెంచర్ చిత్రంలో నటించబోతున్న విషయం తెలిసిందే. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కనుంది. 'జగదేకవీరుడు అతిలోక సుందరి', 'అంజి' తర్వాత చిరంజీవి నటిస్తున్న సోషియో ఫాంటసీ చిత్రమిదే కావడం విశేషం. యూవీ క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మించబోతున్నారు. మంగళవారం పూజా కార్యక్రమాలతో ఈ చిత్రం లాంఛనంగా ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి కె.రాఘవేంద్రరావు క్లాప్‌నివ్వగా, అల్లు అరవింద్ కెమెరా స్విఛాన్ చేశారు. సినిమా లాంచ్‌కు ముందు మ్యూజిక్ రికార్డింగ్‌ను ప్రారంభించారు. మొత్తం ఆరు పాటలుంటాయని సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణి తెలిపారు. ఇలాంటి అరుదైన, అసాధారణమైన సినిమాలో భాగమైనందుకు ఆనందంగా ఉందని గీత రచయిత చంద్రబోస్ పేర్కొన్నారు. సోషియో ఫాంటసీ కథాంశంతో భారీ గ్రాఫిక్స్ హంగులతో ఈ చిత్రాన్ని రూపొందించబోతున్నారు. ఈ చిత్రానికి కెమెరా: చోటా కె నాయుడు, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, ప్రొడక్షన్ డిజైనర్: ఏ.ఎస్.ప్రకాష్, సంభాషణలు: సాయిమాధవ్ బుర్రా, సాహిత్యం: శ్రీ శివశక్తి దత్తా, చంద్రబోస్, రచన-దర్శకత్వం: వశిష్ఠ.

ది గర్ల్ ఫ్రెండ్

అగ్ర కథానాయిక రష్మిక మందన్న నటిస్తున్న తాజా చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్'. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని గీతా ఆర్ట్స్, మాస్ మూవీ మేకర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు నిర్మిస్తున్నాయి. ఇటీవల అనౌన్స్‌మెంట్‌తో పాటు టైటిల్, మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. 'నాదీ అని చెప్పుకోవడానికి ఒక గర్ల్ ఫ్రెండ్ ఉంటే ఆ కిక్కే వేరురా..' అనే వాయిస్‌ఓవర్‌తో మోషన్ పోస్టర్ ఆసక్తిని కలిగించింది. త్వరలో షూటింగ్ ప్రారంభిస్తామని చిత్రబృందం పేర్కొంది. రష్మిక మందన్న నటిస్తున్న తొలి లేడీ ఓరియెంటెడ్ చిత్రమిదే కావడం విశేషం. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కృష్ణన్ వసంత్, ప్రొడక్షన్ డిజైన్: ఎస్.రామకృష్ణ, మౌనిక నిగోత్రి, నిర్మాతలు: విద్య కొప్పినేని, ధీరజ్ మొగిలినేని, రచన-దర్శకత్వం: రాహుల్ రవీంద్రన్.



రామ్‌చరణ్

దీపావళికి తొలిగీతం

రామ్‌చరణ్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్ ఇండియా చిత్రం 'గేమ్ ఛేంజర్'. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది. 'ఆర్‌ఆర్‌ఆర్' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత రామ్‌చరణ్ నటిస్తున్న ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలేర్పడ్డాయి. దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ సినిమా తాలూకు కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. దీపావళి సందర్భంగా చిత్రంలోని తొలి గీతాన్ని విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఓ సాధారణ యువకుడు అసాధారణ నాయకుడిగా ఎదిగిన వైనాన్ని ఆవిష్కరిస్తూ చక్కటి సామాజిక సందేశంతో దర్శకుడు శంకర్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారని తెలిసింది. పాటల కోసమే దాదాపు వందకోట్లు ఖర్చు పెట్టినట్లు సమాచారం. కియారా అద్వాణీ, అంజలి, సముద్రఖని, ఎస్.జె.సూర్య, శ్రీకాంత్, సునీల్, నవీన్‌చంద్ర తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ఎస్.తిరుణావుక్కరసు, సంగీతం: తమన్, సంభాషణలు: సాయిమాధవ్ బుర్రా, నిర్మాతలు: దిల్‌రాజు-శిరీష్, దర్శకత్వం: శంకర్.

'ఉస్తాద్ భగత్‌సింగ్' చిత్రంలో పవన్‌కల్యాణ్

ఉస్తాద్ ఆయుధ పూజ

పవన్‌కల్యాణ్ నటిస్తున్న తాజా చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. హరీష్‌శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్నది. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతున్నది. దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని 'ఆయుధ పూజ' పేరుతో కొత్త స్టిల్‌ను విడుదల చేశారు. ఇందులో పవన్‌కల్యాణ్ చేతిలో భారీ సుత్తిని పట్టుకొని యాక్షన్ మోడ్‌లో కనిపిస్తున్నారు. తాజా షెడ్యూల్‌లో భారీ పోరాట ఘట్టాలను తెరకెక్కిస్తున్నారని తెలిసింది. 'మాస్‌పల్స్ బాగా తెలిసిన దర్శకుడు హరీష్‌శంకర్ ఈ సినిమాలో పవన్‌కల్యాణ్‌ను వినూత్న రీతిలో ప్రజెంట్ చేయబోతున్నాడు. పోలీస్ పాత్రలో ఆయన పర్‌ఫార్మెన్స్ మునుపెన్నడూ చూడని స్థాయిలో ఉంటుంది' అని చిత్రబృందం పేర్కొంది. శ్రీలీల, అశుతోష్ రానా, నవాబ్‌షా తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఆయనంక బోస్, సంగీతం: దేవిశ్రీప్రసాద్, నిర్మాణ సంస్థ: మైత్రీ మూవీ మేకర్స్, రచన, దర్శకత్వం: హరీష్‌శంకర్.

చైతన్యరావు, త్రివిక్రమ్, మామిడి హరికృష్ణ, కుమారస్వామి

మధ్యతరగతి జీవితాలకు దర్పణం

చైతన్యరావు, భూమిశెట్టి జంటగా నటిస్తున్న చిత్రం 'షరతులు వర్తిస్తాయి'. కుమారస్వామి (అక్షర) దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌తో పాటు మోషన్ పోస్టర్‌ను ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ఇటీవల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఈ సినిమాలో కుటుంబ విలువలను అద్భుతంగా ఆవిష్కరించారు. తెలంగాణ మట్టి పరిమళాలు కలబోసుకున్న కథ ఇది. కుటుంబ విలువలు, సంస్కృతి గొప్పతనాన్ని తెలియజెప్పే ఈ తరహా చిత్రాలను మనందరం ప్రోత్సహించాలి' అన్నారు. మధ్య తరగతి కుటుంబాల్లోని సమస్యలను కళ్లకు కట్టినట్లుగా ఈ చిత్రంలో చూపించారని తెలంగాణ సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ తెలిపారు. దర్శకుడు కుమారస్వామి మాట్లాడుతూ 'సమాజానికి మంచి సందేశాన్ని అందించాలనే లక్ష్యంతో ఈ సినిమా తీశాం. త్వరలో విడుదల చేస్తాం. గురూజీ త్రివిక్రమ్‌గారు ఫస్ట్‌లుక్, మోషన్ పోస్టర్‌ను ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నా' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: ప్రవీణ్ వనమాలి, శేఖర్ పోచంపల్లి, సంగీతం: అరుణ్ చిలివేరు, మాటలు: పెద్దింటి అశోక్‌కుమార్, నిర్మాతలు: నాగార్జున్ సామల, శ్రీష్ కుమార్ గుండా, డా॥ కృష్ణకాంత్ చిత్తజల్లు, రచన-దర్శకత్వం: కుమారస్వామి (అక్షర).

రష్మిక మందన్న

అనిల్ రావిపూడి, సాహు గారపాటి, బాలకృష్ణ, శ్రీలీల, హరీష్ పెద్ది

ప్రతి మహిళ సైనికుడిలా మారాలి

'అమ్మవారి నవరాత్రులు జరుగుతున్న సందర్భంలో 'భగవంత్ కేసరి' చిత్రం విడుదల కావడం చాలా సంతోషంగా ఉంది. స్త్రీ శక్తిని చాటే కథతో ఈ సినిమా తెరకెక్కింది. 'బనావో బేటీకో షేర్' అనే బలమైన అంశాన్ని తెలియజెప్పాం. ఇలాంటి గొప్ప సందేశాత్మక చిత్రంలో నటించడం అదృష్టంగా భావిస్తున్నా' అన్నారు అగ్ర హీరో బాలకృష్ణ. ఆయన నటించిన తాజా చిత్రం 'భగవంత్ కేసరి' ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో సాహు గారపాటి, హరీష్ పెద్ది ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా సోమవారం బ్లాక్‌బస్టర్ సెలబ్రేషన్స్‌ను నిర్వహించారు. బాలకృష్ణ మాట్లాడుతూ 'ప్రతి మహిళా ఒక సైనికుడిలా తయారవ్వాలనే బలమైన సందేశాన్ని ఈ సినిమా ద్వారా తెలియజెప్పాం. పిల్లలతో కలిసి ఫ్యామిలీస్ ఈ సినిమా చూస్తున్నారు. ఓ మంచి సందేశం ప్రేక్షకుల్లోకి వెళ్లింది. ఇంత గొప్ప చిత్రాన్ని తీసిన దర్శకుడు అనిల్ రావిపూడిని ప్రత్యేకంగా అభినందిస్తున్నా' అన్నారు. అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ప్రతీ కుటుంబం థియేటర్‌కు వెళ్లి సినిమా చూస్తున్నారు. బాలకృష్ణగారికి హ్యాట్సాఫ్. ఈ సినిమా విషయంలో నాపై పూర్తి నమ్మకం ఉంచి స్వేచ్ఛనిచ్చారు. ఈ విజయం వెనక పెద్ద శక్తిగా నిలిచారు. ఆయనతో ప్రయాణం ఇలాగే కొనసాగాలని, మరో సినిమా చేయాలని కోరుకుంటున్నా' అన్నారు. సినిమాలోని సందేశం ప్రజల్లోకి బలంగా వెళ్తున్నదని హీరోయిన్ శ్రీలీల పేర్కొంది. ఈ సినిమా విషయంలో తమ అంచనాలన్నీ నిజమయ్యాయని, ఫ్యామిలీ ఆడియెన్స్ అద్భుతమైన ఆదరణ కనబరుస్తున్నారని నిర్మాతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు తమన్, అగ్ర నిర్మాత దిల్‌రాజు, నందిని రెడ్డి, రామజోగయ్యశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

'సరిపోదా శనివారం' ప్రారంభం

నాని కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'సరిపోదా శనివారం' మంగళవారం హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైంది. వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయిక. ముహూర్తపు సన్నివేశానికి వి.వి.వినాయక్ క్లాప్‌నివ్వగా, దిల్‌రాజు కెమెరా స్విఛాన్ చేశారు. ఎస్.జె.సూర్య గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సినిమా ఫస్ట్‌లుక్‌లో నాని మాస్ అవతారంలో కనిపిస్తున్నారు. 'యాక్షన్ మాస్ ఎంటర్‌టైనర్ ఇది. నాని పాత్ర పవర్‌ఫుల్‌గా ఉంటుంది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్నాం. పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేస్తాం' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: మురళీ జి, సంగీతం: జేక్స్ బిజోయ్, రచన-దర్శకత్వం: వివేక్ ఆత్రేయ.



ప్రియాంక అరుళ్ మోహన్, నానిపై క్లాప్‌నిస్తున్న వినాయక్

తిరువీర్, ఫరియా అబ్దుల్లాపై క్లాప్‌నిస్తున్న బీఆర్ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్

పీరియాడిక్ పాలిటికల్ థ్రిల్లర్

తిరువీర్, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తున్న తాజా చిత్రం మంగళవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. రవి పనస ఫిల్మ్ కార్పొరేషన్ పతాకంపై రవి పనస నిర్మిస్తున్నారు. గోపి.జి దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. ముహూర్తపు సన్నివేశానికి బీఆర్ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ క్లాప్‌నివ్వగా, నిర్మాత రవి పనస కెమెరా స్విఛాన్ చేశారు. తొలి సన్నివేశానికి డైరెక్టర్ వేణు ఊడుగుల దర్శకత్వం వహించారు. 'పీరియాడిక్ చిత్రమిది. పొలిటికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కించబోతున్నాం. ఈ నెల 25 నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలుపెడతాం. తెలుగు తెరపై సరికొత్త ప్రయత్నంగా పేరు తెచ్చుకుంటుంది' అని దర్శకుడు తెలిపారు. రిషి, రవీందర్ విజయ్, షెల్లీ కిషోర్, కాలకేయ ప్రభాకర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: రాజ్‌తోట, సంగీతం: కె.పి, ప్రొడక్షన్ డిజైనర్: గాంధీ, ఎడిటర్: ప్రవీణ్ పూడి, సమర్పణ: ఏషియన్ ఫిల్మ్స్ నారాయణ దాస్ నారంగ్, పనస శంకరయ్య గౌడ్, నిర్మాత: రవి పనస, రచన-దర్శకత్వం: గోపి.జి.

అపర్ణ, రక్షిత్, నాగశౌర్య

ఎమోషనల్ డ్రామా 'నరకాసుర'

రక్షిత్ అట్లూరి, అపర్ణ జనార్ధన్ జంటగా నటిస్తున్న చిత్రం 'నరకాసుర'. సెబాస్టియన్ నోవా అకోస్టా దర్శకుడు. డా॥ అజ్జా శ్రీనివాస్ నిర్మించారు. నవంబర్ 3న విడుదలకానుంది. ఈ చిత్ర ట్రైలర్‌ను యువ హీరో నాగశౌర్య విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఈ సినిమాలో ప్రతీ సీన్ కొత్తగా అనిపిస్తుంది. నా చిన్నతనంలో చూసిన ఓ సంఘటన ఆధారంగా కథ రాసుకున్నా. కథలో ట్రాన్స్‌జెండర్ అంశం ఆసక్తికరంగా ఉంటుంది. వినోదంతో పాటు ఎమోషన్స్‌తో ఆకట్టుకుంటుంది' అన్నారు. ఈ సినిమా ప్రేక్షకులను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుందని, వారిని సర్‌ప్రైజ్ చేసే అంశాలెన్నో ఉంటాయని హీరో రక్షిత్ అట్లూరి చెప్పారు. వినూత్నమైన కథతో ప్రేక్షకులకు కొత్త అనుభూతినందిస్తుందని నిర్మాత పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: నాని చమిడిశెట్టి, సంగీతం: ఏఐఎస్ నాఫాల్ రాజా, నిర్మాణ సంస్థ: సుముఖ క్రియేషన్స్, ఐడియల్ ఫిల్మ్ మేకర్స్.

ప్రభుత్వ జూనియర్ కళాశాల..

ప్రణవ్ సింగంపల్లి, పాజ్జ వేణున్, రామ్ పటాస్, తేజ గౌడ్ ముఖ్యపాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ప్రభుత్వ జూనియర్ కళాశాల పుంగనూరు-500143'. శ్రీనాథ్ పులకురం దర్శకుడు. ఈ చిత్రం త్వరలో విడుదలకానుంది. టీజర్‌ను ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ విడుదల చేశారు. 'యథార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. టీనేజ్ లవ్‌స్టోరీగా ఆకట్టుకుంటుంది. యువతకు తప్పకుండా నచ్చుతుంది. సాంకేతికంగా ఉన్నతంగా ఉంటుంది' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: నిఖిల్ సురేంద్రన్, సంగీతం: కార్తీక్ రోడ్రిగుజ్, నిర్మాత: భువన్ రెడ్డి కొవ్వూరి, దర్శకత్వం: శ్రీనాథ్ పులకురం.

సుధీర్‌బాబు

1989 నేపథ్యంలో 'హరోం హర'

సుధీర్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'హరోం హర'. 'ది రివోల్ట్' ఉపశీర్షిక. జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సుమంత్ జి నాయుడు నిర్మిస్తున్నారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో పసుపు రంగు దీక్షా దుస్తులు ధరించి, శరీరమంతా రక్తమోడుతూ ఆగ్రహంగా కనిపిస్తున్నారు సుధీర్‌బాబు. అతని వెనక గ్రామస్తులు నిలబడి ఉన్నారు. 'చిత్తూరు జిల్లా కుప్పంలో 1989 నాటి నేపథ్యంలో సాగే కథ ఇది. ఆద్యంతం ఊహకందని మలుపులతో కథ, కథనాలు ఉంటాయి. సుధీర్‌బాబు గత చిత్రాలకు పూర్తి భిన్నమైన పాత్రలో కనిపిస్తారు. దీపావళికి టీజర్‌ను విడుదల చేస్తాం' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: అరవింద్ విశ్వనాథన్, సంగీతం: చైతన్ భరద్వాజ్, నిర్మాణ సంస్థ: శ్రీసుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్, రచన-దర్శకత్వం: జ్ఞానసాగర్ ద్వారక.

వెంకటేష్ మహా, సంపూర్ణేష్ బాబు

ప్రజాస్వామ్యం గొప్పతనాన్ని తెలియజెప్పాం

సంపూర్ణేష్‌బాబు ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'మార్టిన్ లూథర్ కింగ్'. పూజ కొల్లూరు దర్శకత్వం వహించారు. తమిళ చిత్రం 'మండేలా'కు రీమేక్ ఇది. 'కేరాఫ్ కంచరపాలెం' ఫేమ్ డైరెక్టర్ వెంకటేష్ మహా ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లే, సంభాషణలు అందించడంతో పాటు క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించారు. ఈ నెల 27న విడుదలకానుంది. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంపూర్ణేష్ బాబు మాట్లాడుతూ 'తెలుగు నేటివిటీకి తగినట్లుగా ఈ కథలో చాలా మార్పులు చేశాం. ఈ సినిమా కోసం వర్క్‌షాప్‌లో పాల్గొని ప్రతీ సన్నివేశాన్ని రిహార్సల్ చేశాను. ఓ చెప్పులు కుట్టుకునే సాధారణ వ్యక్తిగా ఎలాంటి నాటకీయత లేకుండా సహజంగా నటించే ప్రయత్నం చేశా. నటుడిగా నన్ను ఓ మెట్టెక్కిస్తుందని భావిస్తున్నా. ప్రయోగాత్మక కథలో నన్ను చాలా కొత్తగా చూపించారు. ఈ సినిమా చేశాక సమాజం పట్ల నాకు మరింత బాధ్యత పెరిగినట్లనిపించింది' అన్నారు. వెంకటేష్ మహా మాట్లాడుతూ 'సంపూర్ణేష్‌బాబు తెరపై కనిపిస్తే ఓ సగటు మనిషిని చూసిన భావన కలుగుతుంది. అందుకే ఆయన్ని ఈ సినిమాకు ఎంపిక చేశాం. ప్రజాస్వామ్యం గురించి గొప్పగా చెప్పిన కథ ఇది. అన్ని భాషల వారికి కనెక్ట్ అవుతుంది. కొత్త డైరెక్టర్ అయితే సినిమాకు న్యాయం చేయగలరని పూజ కొల్లూరుకు అవకాశమిచ్చాం. తను నా అసోసియేట్. కథలోని ఆత్మను అర్థం చేసుకొని అద్భుతంగా తెరకెక్కించింది. ఎన్నికల క్షేత్రంలో ఓటర్లే కింగ్ అని ఈ సినిమా ద్వారా తెలియజెప్పాం. సినిమా చూశాక ప్రేక్షకులు కూడా అలానే ఫీలవుతారు' అన్నారు.

సస్పెన్స్ థ్రిల్లర్ 'బాగుంది'

కిషోర్‌తేజ, భవ్యశ్రీ జంటగా నటిస్తున్న చిత్రం 'బాగుంది'. రామ్‌కుమార్ దర్శకుడు. శ్రీసాయి ప్రొడక్షన్స్ పతాకంపై రాజనేని వెంకటేశ్వర రావు, డా॥ మహేంద్రబాబు నిర్మిస్తున్నారు. ఈ చిత్ర టీజర్‌ను దర్శకుడు వేణు ఊడుగుల ఆవిష్కరించారు. ఫస్ట్‌లుక్‌ను తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు ఆర్.కె.గౌడ్ లాంచ్ చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రమిది. ఆద్యంతం ఉత్కంఠగా సాగుతుంది. ప్రేమకథ కూడా మెప్పిస్తుంది. కథానుగుణంగా మంచి పాటలు కుదిరాయి' అన్నారు. శ్రీరామోజు, వంశీకృష్ణ, విజయ్ భాస్కర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రాజు శేషన్న కిట్టు, సంగీతం: హర్ష ప్రవీణ్, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: రామ్ కుమార్.

భూతద్దం భాస్కర్ పరిశోధన

'పల్లెటూరి నేపథ్యంలో సాగే కామెడీ థ్రిల్లర్ 'భూతద్దం భాస్కర్ నారాయణ'. ఒక జ్యోతిష్యుడి కొడుకు సీరియల్ మర్డర్ మిస్టరీలను ఛేదించే ప్రయత్నంలో ఎదుర్కొన్న సంఘటనల నేపథ్యంలో కథ నడుస్తుంది' అన్నారు పురుషోత్తం రాజ్. ఆయన దర్శకత్వంలో శివ కందుకూరి, రాశీ సింగ్ జంటగా నటిస్తున్న చిత్రం 'భూతద్దం భాస్కర్ నారాయణ'. తాజాగా ఈ సినిమాలోని 'కాకా నీ చూపే టెక్క..' అనే గీతాన్ని మంగళవారం విడుదల చేశారు. రాహుల్ సిప్లిగంజ్ ఆలపించిన ఈ గీతానికి విజయ్ బుల్గానిన్ సంగీతాన్నందించాడు. కథానాయకుడి స్వభావాన్ని, అతని శక్తియుక్తులను తెలియజెపుతూ సాగే పాట ఇదని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: గౌతమ్ జి, సంగీతం: శ్రీచరణ్ పాకాల, విజయ్ బుల్గానిన్, నిర్మాతలు: స్నేహల్, శశిధర్, కార్తీక్, దర్శకత్వం: పురుషోత్తంరాజ్.



శివ కందుకూరి